
కథ

బీడీ కంపెనీలో అడుగుపెట్టగానే అదొక వాసన. పుర్రె గుర్తుల గొడవ ఏమోగానీ నా ముక్కు ఆ వాసనకి అలవాటు పడిపోయింది. కంప్యూటర్‌లో ఏరోజు కారోజు లెక్కలు చూసుకోవడంతో రోజంతా పని సంపూర్ణంగా వుంటుంది. ఖాళీ సమయమే లేకుండా వుంటుంది. నాతో పాటు ఇంకొక నలుగురు అకౌంట్స్‌లో పని చేస్తుంటారు. వారు కూడా ఎవరి పనిలో వారు నిమగ్నమైపోతారు. ఈ మధ్యనే ఒక కొత్త వ్యక్తి ఉద్యోగంలో చేరాడు. మనిషిని చూస్తే గుంబస్తాలాగా వుంటాడు. కానీ మాటకారి. పని చేతకాకున్నా మెప్పించే సత్తా వున్నవాడు. అవసరమైతే ఎదుటి వారి మీద రుద్ది తప్పించుకునే తత్వం.

# పరిష్కారం

– జి.విజయ మహేశ్వరరెడ్డి



ఈ మధ్య కాలంలో సహ ఉద్యోగి చిత్ర ఎప్పటిలా మాట్లాడకపోవడం ఏదో పోగొట్టుకున్న దానిలా వుండడం గ్రహించాను. ఉదయం పూట బాగానే కనిపిస్తుంది. సాయంత్రం కాగానే ఆమె ముఖంలో మార్పు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. విషయం ఏంటో తెలుసుకోవాలనుకొన్నాను. ఒకరి పర్సనల్ విషయం తెలుసుకోవడం ఇష్టం లేకున్నా కలిసి పనిచేస్తున్నప్పుడు ఆమెలో సడన్‌గా వచ్చిన మార్పును తట్టుకోలేకపోయాను. ఉదయం వీలు చూసుకొని అడిగి తెలుసుకోవాలనుకున్నాను.

ఉదయం రాగానే ఒంటరిగా ఉన్నది చూసి ఆపుకోలేక ''ఎంటీ చిత్ర ఈ మధ్య అదోలా వుంటున్నావు? ఆరోగ్యం బాగుండట్లేదా?'' మెల్లగా విషయం రాబట్టడానికి ప్రయత్నం చేసాను.

''అదేం లేదండీ బానే వున్నాను'' అంటూ బలవంతాన నవ్వు తెచ్చుకొని అక్కడి నుంచి వెళ్లబోయింది.

''లేదు చిత్రా! నీలో ఏదో మార్పు కనిపిస్తోంది. నీవు దాస్తున్నావు'' కొంచెం మందలింపుగా అడిగాను.

ఒక్కసారి కంటతడి పెట్టి ''నాకేదో శని దాపురించింది సార్ అందుకే ఇలా వుంటున్నా'' నంటూ మళ్లీ పనిలో నిమగ్నమైంది. ఆమెను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక మళ్లీ అడగలేక పోయాను.

ఎప్పటిలాగే ఆఫీసు పని ముగించుకొని బయట బస్సుకోసం ఎదురు చూస్తున్నాను. చిత్ర కూడా నా పక్కనే వచ్చి నిలబడడం చూసాను. ఇదే అదనుగా భావించి ''ఏమైంది చిత్రా? ఇప్పుడు చెప్పు నీ బాధేంటి? బాధను నీలోనే దాచుకుంటే నిన్ను దయ్యంలా కాల్చుకుతింటుంది. ఇంకొకరికి చెప్తే గానీ తగ్గదు. విషయం ఏంటో చెప్పు నాకు తోచిన సహాయం చేస్తానని'' ప్రామిస్‌గా ఆమె కళ్ళలోకి చూసాను.

''సార్ నాకు మొన్నటి వరకు బాగానే వుండేది. ఎటొచ్చి కొత్తగా వచ్చిన వ్యక్తితోనే ఇబ్బంది మొదలైంది. అతను నేను కాలేజీలో చదివే రోజులలో నా సీనియర్. అప్పట్లో నా వెంటబడి ఇబ్బంది పెట్టేవాడు. కాలేజీ అయిపోయిన తరువాత ఎంతో రిలీఫ్‌గా ఫీల్ అయ్యాను. మళ్లీ అదే సమస్య మొదలైంది.

కాలేజీ రోజులలో తెలిసో తెలియకో లవ్ లెటర్స్ రాయడం, కలిసి తిరగడం లాంటివి చేయడం జరిగింది. అది ఇంట్లో గొడవ అయి అన్నిటికీ దూరంగా వున్నాను. అప్పుడు నేను చేసిన పొరపాటు ఆసరాగా తీసుకొని నన్ను బెదిరించడం మొదలుపెట్టాడు. అప్పుడు చేసిన వన్నీ మీ ఆయనికి తెలిసే విధంగా చేస్తాను. అప్పుడు నీ బ్రతుకు ఎలా వుంటుందో చూడు అంటూ బెదిరించడం, అంతేకాక అతనికి తను చెప్పినట్లు చేస్తే అవన్నీ నాభర్తతో చెప్పనని డిమాండ్ చేస్తున్నాడు. రోజూ అసభ్యంగా మాట్లాడడం, సూటిపోటీ మాటలతో రోజుకో విధంగా చిత్రవధ చేస్తున్నాడు'' కన్నీటిని ఆపుకుంటూ చెప్పసాగింది.

ఆమెను ఓదార్చలేకపోయినా, నీ సమస్యకి పరిష్కారం చూపిస్తాను. ఈ విషయంలో నింపాదిగా వుండమని భరోసా ఇచ్చి ఇంటికి వచ్చేశాను. భరోసా ఇచ్చానే గానీ రాత్రంతా ఒకటే ఆలోచన. ఎలా ఈ సమస్యకి పరిష్కారమని? పలువిధాలుగా ఆలోచించడం మొదలుపెట్టాను. నిజానికి చిత్ర ఎంతో అందంగా వుంటుంది. అంతే కాదు ఆమె కళ్లలో ఏదో కళ కొట్టొచ్చినట్లుగా వుంటుంది. చూసిన కొద్దీ చూడాలనిపించే ముఖవర్చస్సు. నేనే ఒక్కోసారి అలాగే చూస్తుండిపోతాను. కొందరి ముఖాలు, శరీర ఆకృతిగానీ రెచ్చగొట్టే విధంగానే వుంటాయి. పాపం ఈమె పరిస్థితి అంతే. ఆమెలో ఎటువంటి ఆలోచన లేకున్నా, ఎదుటి వాళ్లలో కోరిక రగిలే విధంగా కనిపిస్తారు.

మొదట పోలీస్ స్టేషన్‌లో కంప్లయింట్ చేద్దామని అనుకొన్నా. అది ఆమె జీవితానికి సమస్యగా మారుతుంది. నేను పిలిచి మందలిద్దామనుకొన్నా. కానీ అది వాడు పట్టించుకోకపోగా ఇంకా కసితో సమస్యగా తయారయ్యే అవకాశం వుంది. అందరి ముందూ మందలించి చెంప చెళ్లుమనేలా కొట్టి బుద్ధిచెప్పమని చెబుదామనిపించింది. ఇంకా క్రూరుడిగా మారే అవకాశం లేకపోలేదు. చివరకి ఒక నిర్ణయానికి వచ్చి నిద్రలోకి జారుకొన్నాను.


మరునాడు ఉదయమే చిత్రని పిలిచి, చిత్రా ''నీకు వాడి భార్య పిల్లలతో ఏమైనా పరిచయం వుందా?'' అని అడిగాను. 'లేదు' అంది. ''కనీసం వాడి ఇల్లయినా తెలుసా?'' అని అడిగాను ''తెలియదండీ.'' ''అయితే ఒక పనిచెయ్యి. నేరుగా వాళ్ల ఇంటి అడ్రస్ కనుక్కొని వాళ్ల ఇంటికి వెళ్లు. నేను చెప్పిననట్లు చేయమని'' సలహా ఇచ్చాను.

ఏదోలా ఇంటి అడ్రస్ కనుక్కొని వాడు లేని సమయం చూసి ఇంటికి వెళ్లింది చిత్ర. ఇంట్లో వాడి భార్య, పిల్లలు వుండడం చూసి తనకు తానే పరిచయం చేసుకొంది. కొద్దిసేపు పిల్లలను బయటకు పంపించమని చెప్పి, ఆ తరువాత విషయమంతా స్పష్టంగా ఆమెకు చెప్పింది. చిత్ర బాధను అర్థం చేసుకున్న ఆమె కూడా కన్నీటి పర్యంతం అయింది. చివరకు చేతులెత్తి నమస్కారం చేసి ఆమె సహాయం కోరి ఇంటికి వచ్చేసింది.

తెల్లవారి మా ఇద్దరిలో ఉత్కంఠ. ఏం జరిగిందో? ఏమీ జరుగుతుందోనని ఊహించుకుంటేనే భయమేసింది. ఎవరి పని వాళ్లు చేసుకోవడం మొదలుపెట్టాము. కొద్దిసేపటికి ఎవరో అబ్బాయి లీవు లెటరు ఇచ్చి వెళ్లాడు. అందులో వాడు వారం రోజులు లీవు పంపించాడు. ఇద్దరము కొంచెం ఊపిరి పీల్చుకున్నాం. ఆ తరువాత వాడు ఆఫీసుకి రాలేదు. వాడి గురించి ఆరా తీస్తే వేరే చోట పని చేస్తున్నట్లు తెలిసింది. వాడి భార్య ఏమీ చేసిందో తెలియదు. కానీ సమస్యకి పరిష్కారం దొరికింది. చిత్ర రెండు చేతులూ జోడించి అర్థతతో నా వైపు చూసింది. ఒక మంచి పని చేసానన్న తృప్తి నాలో మిగిలింది.

*

# పవన్ 'సత్యాగ్రాహి' మళ్లీ తెరపైకి



గతంలో ఏ.ఎం రత్నం నిర్మాణంలో పవన్ కళ్యాణ్ హీరోగా 'సత్యాగ్రాహి' చిత్రం ప్రారంభమై తర్వాత ఆగిపోయిన సంగతి విదితమే. అయితే ఇటీవల ఇదే సినిమాని పవన్ కళ్యాణ్ దర్శకత్వంలో నూకారపు సూర్యప్రకాశరావు నిర్మించనున్నట్లు తెలిసింది. అందుకు పవన్ 2 కోట్లు అడ్వాన్స్‌గా స్వీకరించినట్లు కూడా వార్తలొస్తున్నాయి. పవన్ స్వయంగా తయారు చేసుకున్న మొదటి స్క్రిప్ట్ ఆయన ఆశయాలను ప్రతిబింబించేదని, అయితే చిరు ఆశయాలకు అనుగుణంగానూ దానిని మార్చనున్నారని సమాచారం. 'ప్రజారాజ్యం' పార్టీ ఆశయాలను కూడా ఈ చిత్రం ప్రతిబింబిస్తుందని కొందరంటున్నారు. ప్రస్తుతం కథపై ఓ ప్రముఖ రచయిత పనిచేస్తున్నట్లు తెలిసింది. అంజనా ప్రొడక్షన్స్‌పై నిర్మించడానికి నాగబాబు కూడా సన్నద్ధంగా ఉన్నాడట. పవన్ మరో చిత్రం 'పులి' సంక్రాంతికి విడుదల కావచ్చనుకుంటున్నారు. నాగార్జున 'కింగ్', రవితేజ 'నేనింతే'లు డిసెంబర్ మూడో వారం లోనే విడుదలవుతుండటంతో ప్రస్తుతానికి సంక్రాంతి సినిమాల్లో 'పులి'కి అడ్డే లేదని చెప్పవచ్చు.